# తస్మై నమః కర్మణే!

మానవుడు ఆనంద పిపాసి. బ్రహ్మానందమును పొందగోరువాడు మొట్టమొదట హృదయమును పరిశుద్ధం గావించుకోవాలి. పాలసముద్రంగా ఉండవలసిన మానవ హృదయము ఈనాడు దుఃఖాలకు నిలయముగా, దుర్భావములకు కేంద్రముగా తయారైనది. హృదయాన్ని పవిత్రమైన పాలసముద్రమువలె మార్చుకొనుటకు ప్రయత్నించటమే సాధకుని ప్రధాన కర్తవ్యం. పాల గుణము తెలుపు. హృదయమునందు సాత్త్విక గుణమున్నప్పుడు అదే క్షీర సాగరం. ఆ క్షీర సాగరముననే విష్ణువు శయనిస్తాడు. హృదయము పవిత్రమైనప్పుడే పరమాత్ముడు అందులో నివసిస్తాడు. కాని, ఈనాటి మానవుడు తమో గుణమునకు, రజోగుణమునకు స్థానము నిచ్చి హృదయమును కలుషితం గావించుకొని క్షార సాగరంగా తయారు చేసికొంటున్నాడు. క్షీర సాగరమును క్షార సాగరంగా మార్చుకోవటం విరుద్ధ మార్గము. క్షార సాగరములో సొర చేపలు, మొసళ్ళు, తిమింగిలములు అనే కామ క్రోధ లోభ మోహ మద మాత్సర్యములు నివసిస్తుంటాయి. ఇట్టి దుష్ట జంతువులకు హృదయమును స్థానముగ చేసుకోవటం అవివేకం. పరమాత్ముడు క్షీరసాగర శయనుడు. అనగా హృదయవాసి. కనుక హృదయాన్ని క్షీర సాగరంగా మార్చుకోవాలి. శుద్ధ సత్త్వ గుణమును అభివృద్ధిపరచుకొని రాజసిక, తామసిక గుణములను దూరముగావించుకోవాలి.

### మానసిక ఆరోగ్యము

విజ్ఞులైనవారు ప్రతినిత్యం తమ హృదయాన్ని పరిశీలన చేసుకోవడానికి ప్రయత్నించాలి. హృదయంలో పవిత్ర భావములు అభివృద్ధి చెందుతున్నాయా లేక అపవిత్ర భావములు పెంపొందుతున్నాయా అని విచారణ సలపాలి. పూజలు చేసుకొంటున్నప్పుడు మంత్రాలద్వారా 'దేవతలారా రండి! నాలో చేరండి!' అని ఆహ్వానిస్తాము. 'నాలో ఉన్న

sri sathyasai vahanamrutam

రాక్షసులారా! మీరు వెళ్ళిపోండి' అని ప్రార్థిస్తాము. ఆరోగ్యమును పూర్తిగా కాపాడుకోవాలన్న, లోపల ఉన్న మాలిన్యాలను తొలగించుకోవాలి. మంచి పదార్థాలను స్వీకరించాలి. ఈ రెండు విధములైన కర్మలవలననే ఆరోగ్యంగా పుష్టిగా సంతుష్టిగా ఉండటం సాధ్యం కాగలదు. అదే విధముగా మానసిక ఆరోగ్యమునుకూడా కాపాడుకొనుటకు ప్రయత్నించాలి. పాంచ భౌతికమైన దేహానికి అనారోగ్యం కలిగినప్పుడు తగిన వైద్యం చేయించుకొంటూ పథ్యం చేస్తాము. దేహానికి ఏ కొద్ది మాలిన్యమంటినా వెంటనే శుభ్రపరచుకుంటాము. కాని మనస్సుకు ఎన్ని మాలిన్యములంటినా పరిశుద్ధం చేసుకోవటానికి ప్రయత్నించటం లేదు. కారణం, బయటి దృష్టి! లోకానికి ప్రదర్శించటానికి మాత్రమే బయటి మాలిన్యాల్ని తొలగించుకొంటున్నాము.

**అద్దెకొంప**

బహిర్దృష్టి కలిగి ఉండేది పశువు, అంతర్దృష్టి గలవాడు మానవుడు. కాని అంతర్దృష్టి గల మానవుడుకూడ బహిర్దృష్టితోటే జీవితమును అంతం గావించుకొంటున్నాడు. మలినమైన దుస్తులు వేసుకున్నప్పుడు మిత్రుడు వస్తే సిగ్గుపడతారుగాని హృదయం మలినమై ఉన్నప్పుడు భగవంతుని చూసినాకూడా సిగ్గుపడరు! 'హృదయం ఎవరికీ కనిపించదు కదా' అని ధైర్యం! మొట్టమొదట హృదయాన్ని పరిశుద్ధం గావించుకోవటానికే ప్రయత్నించాలి. అప్పుడే మానవ దేహం మాధవుని నిలయంగా రూపొందుతుంది. దేహము, దేవుని నిలయము. అయితే ఇది బాడుగ ఇంటివంటిది. మృణ్మయమే కాని చిన్మయం కాదు. ఎప్పుడో ఒకప్పుడు ఈ ఇంటినుండి వెళ్ళక తప్పదు. ఏనాటికైనా దీనిని వీడక తప్పదు. కాని ఈ సత్యాన్ని గుర్తించలేకుండా పోతున్నాము.

జీవుని లక్ష్యమునకు ప్రమాణము కర్మయే! తన మంచి చెడ్డలకు కర్మయే కారణము, కనుకనే 'తస్మై నమః కర్మణే' అన్నారు, జ్ఞానులు. పవిత్రమైన కర్మలు ఆచరిస్తే పవిత్రమైన ఫలితాలను అందుకుంటాము. తద్వారా చిత్తశుద్ధి కలుగుతుంది. చిత్తశుద్ధి వలన జ్ఞానసిద్ధి. "చిత్తస్య శుద్ధయే కర్మః" కర్మ ద్వారానే చిత్తశుద్ధి కలుగుతుంది. తెల్లవారి లేవగానే భగవంతునికి నమస్కారం చేసుకున్నట్లే తాను చేయబోయే ప్రతి కర్మకు ముందు

srisathyasaivachanamrutam

నమస్కారం చేయాలి. నాచేత పవిత్రమైన, సార్థకమైన, పరోపకారమైన కర్మలు మాత్రమే చేయించమని ప్రార్థించాలి. కర్మల ఫలితమే జన్మమునకు మూల కారణము.

కర్మము, జన్మము, ధర్మము, మర్మము, బ్రహ్మముతో చేరినవి. ఈ నాలుగు గోడల ఇల్లువంటిది బ్రహ్మం. ఈ నాలుగు గోడలలోనే బ్రహ్మ ఉంటాడు. కనుక మనసు ఏది ఇష్టపడితే అది ఆచరించరాదు. చేయ తగినదా కాదా బాగా విచారణ సలిపి ఆ తర్వాత కర్మలో ప్రవేశించాలి. తొందరపాటు తగదు. వేగిరపాటు విషతుల్యమై పోతుంది. కర్మలను సక్రమంగా ఆచరిస్తే రజస్తమో గుణములు ప్రవేశించడానికి వీలులేకుండా ఉంటుంది. కేవలం సాత్త్విక భావాలు ప్రవేశించాలంటే హృదయం పరిశుద్ధంగా ఉండాలి. పరిశుద్ధంకాని హృదయంలో భగవంతుడు నివసించడు.

**ఆగ్రహం లేదు, అనుగ్రహం లేదు**

భగవంతుడు నన్నిట్లా ఎందుకు బాధపెడుతుంటాడని కొందరు ప్రశ్నిస్తుంటారు. భగవంతునికి ఆగ్రహించడం కాని అనుగ్రహించడం కాని రెండూలేవు. భగవంతునికి ఒకని శిక్షించాలని కాని మరొకని కాపాడలని కాని ఉండదు. కర్మాధికారం మాత్రమే భక్తులది. కర్మఫలాధికారం భగవంతునిది. కర్మలు చేయవలసినది మీరు. ఫలితాన్ని అందించేది భగంతుడు. కర్మలు సక్రమంగా ఉంటే భగవంతుడు సరైన ఫలితమునే అనుగ్రహిస్తాడు. ఐతే, చేసే కర్మల తత్వాన్ని విచారించుకొనక భగవంతుడిచ్చిన ఫలితమును మాత్రమే దృష్టియందుంచుకొంటున్నారు. అదే పెద్దపొరపాటు.

'ఓ దేవుడా! ఇన్ని కోట్లమంది జనులలో నేను నీ దృష్టిలో ఎక్కడ ఉంటాను? నీవు నన్నెక్కడ చూస్తావు? నన్నింక చూడవా' అని ఒక భక్తుడు విలపిస్తున్నాడట! భక్తునికి ఒక శబ్దం వినిపించింది, 'ఓ భక్తుడా! ఎన్ని పనులలోనో దృష్టి పెట్టుకున్నావు. కాని నాపైన మాత్రం దృష్టి పెట్టలేదే! నన్ను నీవు తలచనైనా తలచలేదే! మరచినది నీవా? నేనా?' అని. లోకసంబంధమైన వృత్తులకు, కర్మలకు అంకితమైపోయి అన్ని చింతనలు చేస్తున్నారు. దైవచింతన మాత్రం చేయటం లేదు. ఎక్కడో ఏ దేశములోనో ఏ ప్రాంతములోనే ఉన్న బంధువులను మిత్రులను మరవకుండా తలచుకుంటారు. కాని, సమీపంలో ఉన్న

sri satyasai vachanamrutam

భగవంతునిమాత్రం తలచుకోరు. కష్టాలు వచ్చినప్పుడు మాత్రం 'ఓ దేవుడా! నన్ను మరచిపోయావా?' అంటారు. మరచిపోయింది దేవుడా? వీరేకదా!

## పోస్ట్‌మాన్ డ్యూటీ

మొదట మన దోషాలను మనం గుర్తించుకుంటే భగవంతుని పవిత్ర హృదయం మనకు అర్థమవుతుంది. కాని ఈనాడు తమ దోషాలను తాము కప్పిపుచ్చడం, భగవంతుడిచ్చిన శిక్షను మాత్రం ప్రచారం చేయడం జరుగుతున్నది. ఏ చిన్న విషయంలోనైనా కారణం లేని కార్యముండదు. తప్పులేకపోతే శిక్షపడటానికి అవకాశమే ఉండదు. ప్రతి కర్మకు ప్రతిక్రియ ఉంటుంది. ప్రతి శబ్దానికి ప్రతిధ్వని ఉంటుంది. ప్రతి ఆకారానికి ప్రతిబింబం ఉంటుంది. భగవంతుడు ప్రతి దానికి ప్రతిఫల మివ్వడానికి కాచుకొని ఉంటాడు. మంచిపని చేస్తే మంచిఫలం, చెడ్డపని చేస్తే చెడ్డఫలం తక్షణం ఇవ్వడానికి సిద్ధంగా ఉంటాడు. కర్మ పోస్టులో వచ్చే కవరులాంటిది. దానిని అందించేవాడు, భగవంతుడు. వ్రాసిన దానికి సమాధానం వస్తుంది. భగవంతుడు అందిస్తాడు. అంతే! అందుకే 'కర్మఫలప్రదాత' అని అతనికి పేరు.

దుర్యోధనుడు ద్రౌపదిని పరాభవించడానికి పూనుకొన్న సమయంలో ఆమె కృష్ణుని అనేక విధముల ప్రార్థించింది. ఆమె మొరను కృష్ణుడు ఆలకించికూడా ఏమీ చేయలేకపోయాడు! కారణం, ప్రకృతి శాసనం. ఆ సమయంలో ప్రకృతి శాసనాన్ని గురించే విచారిస్తున్నాడు, కృష్ణుడు. దానికి తిరుగులేదు. ఒక చిన్న ఉదాహరణము. పైనుండి కాలు జారితే క్రింద పడిపోతారు. బంతి పైకి ఎగురవేస్తే అది క్రిందికే వస్తుంది. కారణమేమిటి? భూమికి ఆ విధమైన శక్తి ఉంది. కోటీశ్వరుడు కాని, కూటిపేద కాని, కాలుజారినప్పుడు ఎవరైనా పడవలసిందే! ఇక్కడ అధికార, అనధికారముల ప్రసక్తి లేదు. దానికి కారణమేమిటంటే, అది ప్రకృతి శాసనము. ప్రకృతి శాసనమునుండి ఎవ్వరూ తప్పుకోవటానికి వీలుకాదు.

## స్వల్ప త్యాగానికి అక్షయ ఫలం

ప్రకృతి శాసనము ననుసరించి ద్రౌపది ఎక్కడెక్కడ, ఏమేమి చేసిందో ఆలోచించసాగాడు, కృష్ణుడు. ఈనాటి ఈ సభలో రక్షణ పొందటానికి ద్రౌపది ఎప్పుడైనా

sri sathyasai vahini amrutam

ఏమైనా చేసిందా యోచించాడు. పత్రం, పుష్పం, ఫలం, తోయం భగవంతునికి ఏది అర్పితం చేసినా సర్వ అర్పితం చేసినట్లే! కుచేలుడు పిడికెడు అటుకులు ఇచ్చినందుకు బహుళ భాగ్యాలనిచ్చాడు, కృష్ణుడు. ఆ పిడికెడు అటుకులైనా ఇవ్వకపోతే కుచేలునికి భాగ్యం అబ్బేది కాదు. ఏదో ఒక దానిని ఇచ్చుకోవాలి. ఒకటి త్యాగం చేసినప్పుడే మరొకదానిని అందుకోగలుగుతాము. లౌకికంగా కూడా 5 రూపాయలు షాప్ కీపర్ ముఖాన కొడితేనే వాడు ఒక చేతి రుమాలు మన ముఖాన కొడతాడు! కృష్ణుడు గత స్మృతులు జ్ఞప్తికి తెచ్చుకోసాగాడు. అది సంక్రాంతి పండుగ రోజు. నేను చెరకు తింటున్నాను. నా చిటికెన వ్రేలు కోసుకోపోయింది. రుక్మిణి చెలికత్తెను లోపలకు పంపింది, బట్ట తీసుకరమ్మని. సత్యభామ పరుగెత్తిపోయింది, బట్ట తేవడానికి. ద్రౌపది తక్షణం తన చీరకొంగు చింపి వ్రేలుకు కట్టు కట్టింది. కట్టుకున్న చీరను చింపి నాకోసం త్యాగం చేసింది! తనకిచ్చింది రెండు ఇంచీల బట్ట దానినే అక్షయం చేస్తానని 'అక్షయం' అన్నాడు. ఆ బట్టయే అక్షయమై అన్ని చీరలుగా మారింది!

ఒకరికిచ్చినప్పుడే అనంతమైన ఆనందాన్ని పొందుతాము. అయితే, మనం ఇవ్వడానికి సిద్ధంకాముకాని పుచ్చుకోవడానికి మాత్రం సిద్ధంగా ఉంటాము. పవిత్ర కర్మలు చేయడానికి పూనుకోము. పాప కర్మల ఫలితాలు వద్దంటాము, కాని పాప కర్మ చేయడానికే ముందుకు పోతాము. పుణ్యకర్మ ఫలం కావాలంటాం, కాని పుణ్య కర్మలు చేయడానికి వెనుకంజ వేస్తాము. ఇదే మనం చేసే తప్పు. పుణ్యకర్మ ఫలం కావాలని ఆశిస్తే పుణ్య కర్మలు చేయాలి. పాపకర్మల ఫలం వద్దంటే పాప కర్మలు చేయకూడదు. పాప కర్మలు చేసి ఫలితం వద్దంటే అదెట్లా కుదురుతుంది? మామిడిచెట్టు నాటితే మామిడిపండ్లే వస్తాయి. వేపచెట్టు నాటి మామిడిపండ్లు కాయాలంటే కాస్తాయా? ఏ పండు కావాలని ఆశిస్తే ఆ పండు విత్తనము నాటాలి. విత్తనమొకటైతే వేరు ఫలములు లభించుట ఎట్లా సాధ్యమవుతుంది?

### నిత్య శుద్ధునికి నిర్మల హృదయం

చేసే కర్మలలోనే ఆనందము, దుఃఖం రెండూ ఇమిడి ఉంటాయి. నిరంతరం ఆనందం అనుభవించాలంటే మంచి భావాలను చేర్చుకోవాలి. ఎప్పుడూ పవిత్రమైన ఊహలు రావాలి.

sri sathyasai vachanamrutam

చెడ్డ ఊహలు, చెడ్డ తలంపులే వస్తే అలాంటి హృదయంలో పరమాత్ముడే రీతిగా పవళిస్తాడు? కోరికలకోసం బయట కూర్చున్నప్పుడు క్రింద పేపరో చేతిగుడ్డనో వేసుకొని కూర్చుంటాము. మలినమైన దేహానికే పరిశుద్ధమైన గుడ్డ వేసుకొంటున్నప్పుడు నిత్య శుద్ధ బుద్ధ ముక్తుడైన భగవంతుడు కూర్చోవడానికి హృదయం ఎంత పరిశుద్ధంగా ఉండాలి! చిత్తశుద్ధి నిమిత్తమే మంచి కర్మలు చేయాలి. ఇంకే జపాలు, ధ్యానాలు, యోగాలు చేయనక్కరలేదు. మంచి పలుకులు, మంచి చూపులతో హృదయం మంచిగా మారుతుంది. హృదయం పరిశుద్ధంకాక జప ధ్యానాలు, భజనలు ఎన్ని చేసినా ఏమి ప్రయోజనం?

**బండి ముందు, గుఱ్ఱం వెనుక!**

దేహారోగ్యంకంటే మానసిక ఆరోగ్యం ముఖ్యం. దేహం బండి, మనస్సు గుర్రం వంటిది. గుర్రం ముందు, దాని వెనుక బండి ఉన్నప్పుడే ప్రయాణం సాగుతుంది. కాని, ఈనాడు బండి ముందు, గుర్రం వెనుక! దేహానికి అలంకారాలు చేయడంతోటే సరిపోతున్నది. మనసుకు తగిన మేత వేయడంలేదు. సత్సంగము, సత్ప్రవర్తన, సదాలోచన, సచ్చింతన మనసుకు తగిన మేత. కనుకనే 'ఏది చేసినా భగవత్ప్రీత్యర్థం' అనే భావంతో చేస్తే ప్రతి కర్మ పరిశుద్ధంగానే ఉంటుంది.

**భక్తవశుడు**

ఒక భక్తురాలు ఉండేది. ఆమె కృష్ణ భక్తురాలు. ప్రతి దినం ఉదయమే లేచి కృష్ణమందిరాన్ని చక్కగా పేడతో అలికి అలంకరించి దీపాలు పెట్టించేది. మిగిలిన పేడ కృష్ణార్పణం అని బయట పారవేసేది. ఊరిలోని కృష్ణాలయం పూజారి ఉదయమే అభిషేకం చేసి కృష్ణుని ముఖంమీద పేడ ఎక్కడినుండి వచ్చిపడుతున్నదో తెలియక బాధపడేవాడు. రెండు రోజులు చూసి గ్రామ పెద్దలకు ఈ విషయం తెలిపాడు. వారుకూడా ఆలయానికి వచ్చి సరిగ్గా హారతి సమయంలో కృష్ణుని ముఖాన పేడ ఎక్కడినుండో వచ్చి పడటం చూసారు. ఎవరు పేడ వేస్తున్నారో చూద్దామని ఆలయంచుట్టూ వీధివీధికి కాపలాపెట్టాడు. ఒక వీధిలో ఒక ఇల్లాలు ఇంటినుండి బయటకువచ్చి 'కృష్ణార్పణం' అని పేడ పడవేయడం ఒక కాపలాదారు చూసాడు. 'పేడ వేస్తున్నది ఒక స్త్రీ', అని తెలిపాడు. ఆమె ఇక్కడ

sri sathyasai vachanamrutam

కృష్ణార్పణమని పేడ బయటకు వేయడం అంతా గమనించారు. 'అర్పించినది మంచి పదార్థమా చెడ్డపదార్థమా' అని చూడడు. చిత్తశుద్ధిని మాత్రమే చూస్తాడు, భగవంతుడు. అతను పరమ పవిత్రుడు కనుక అతని దృష్టికి అన్నీ పవిత్రమే! ఈశ్వరుని సృష్టిలో ఏదీ చెడ్డకాదు. మన దృష్టిదోషమే తప్ప సృష్టిలో దోషంలేదు. భక్తురాలు కృష్ణార్పణమని వేసిన పేడ కృష్ణునికి చేరిపోయింది! గ్రామపెద్దలు ఆ భక్తురాలి దగ్గరికివెళ్ళి 'నీవు కృష్ణుని ముఖాన రోజూ పేడ కొడుతున్నావు, మహా దుర్మార్గురాలవు', అని తీవ్రంగా మందలించారు. అయితే ఈమె ఇంటిముందు వేస్తున్న పేడ ఆలయంలోని కృష్ణుని ముఖాన ఎట్లా పడుతున్నదని ఆలోచించే జ్ఞానం వాళ్ళకు లేకపోయింది. వివేకం, విచక్షణాజ్ఞానం శూన్యమైపోయింది. కేవలం పేడను మాత్రమే దృష్టియందుంచుకున్నారు తప్ప ఇదేదో శక్తి, భక్తి లేదా రక్తి, అనురక్తి అని వారు ఊహించలేకపోయారు. భక్తురాలిని, ఆమె భర్తను, అత్తమామలను అందరినీ పట్టుకొనిపోయారు. ఆమె 'అయ్యో! నా కృష్ణునిపై నేను పేడ వేస్తానా? నా కృష్ణునికి నేనెప్పుడూ అపచారం చేయను. ప్రాణాన్నైనా అర్పిస్తాను కాని ఇలాంటి దుర్మార్గానికి ఒడిగడతానా', అన్నది. అయితే, 'రేపటినుండి అక్కడ పేడ వేయవద్దు' అన్నారు, పెద్దమనుషులు. అత్త మామలు, భర్త ఒత్తిడిపై ఆమె అతి కష్టంగా అందుకు ఒప్పుకున్నది. ఆమె ఇష్టానికి ప్రజలంతా ఏనాడు అడ్డు తగిలారో ఆ రోజునుండి కృష్ణ మందిరం తలుపులు మూసుకున్నాయి. ఎన్ని ప్రయత్నాలు చేసినా అవి తెరచుకోలేదు. గ్రామ పెద్దలు తమ అపరాధాన్ని గుర్తించి భక్తురాలి దగ్గరకి వెళ్ళి 'మా తప్పు మన్నించ'మని ప్రార్థించారు. వెంటనే ఆలయ ద్వారాలు తెరచుకున్నాయి. భక్తుల విషయం భక్తులకే తప్ప అన్యులకు అర్థంకాదు, ఇలాంటి అనుభూతులు ఎన్నో జరుగుతూ రావడంవల్లనే భారతదేశం తపోభూమిగా రూపొందింది.

**ఆత్మార్పణం**

మీరా భక్తితన్మయత్వంలో కృష్ణునిలో లీనమైపోయింది! కృష్ణమందిరం కట్టించాలని భర్తను కోరింది. ఆయన చలువరాతితో చక్కని మందిరం కట్టించాడు. ఆమె నిరంతరం కృష్ణమందిరంలో భజనలు కీర్తనలతో కృష్ణ భక్తిరసామృతాన్ని గ్రోలుతూ తన్మయత్వంలో

sri sathyasai vachanamrutam

ఉండేది. వివాహానికి పూర్వం ఇచ్చిన మాట ప్రకారం కొంతకాలం భర్త ఆమె భక్తికి అడ్డు చెప్పలేదు. కాని, తర్వాత అతనికి విసుగు పుట్టింది. ఆమెను కృష్ణమందిరానికి పోనీయకుండా కట్టడిచేసాడు. ఫలితం లేకపోయింది. అసలు వెళ్ళడానికి వీలులేకుండా మందిరం ద్వారాలు మూసివేయించాడు. ఈ మందిరం రాణా కట్టించినది. దానిని మూసి వేయగలిగారు. 'నా హృదయ మందిరం ఎవరు కట్టినదీ కాదు. దీనిని మూసివేయడం ఎవరి తరం కాదు. చలోరే మన్ గంగా యమునా తీర్!' అని మనస్సును ప్రబోధించింది. ఆమె మనస్సు ద్వారకలో కృష్ణునిపై నిలిచింది. మనసుతో దేహంకూడా పరుగెత్తింది. గాలి, వర్షం, పిడుగులు దేనిని లెక్కచేయకుండా 'గోపాలా గోపాలా' అని పాడుకొంటూ ద్వారక చేరుకున్నది. కృష్ణమందిరంలోకి ప్రవేశించింది. ద్వారాలు మూసుకున్నాయి. ఎందరు ఎంత ప్రయత్నించినా తెరచుకోలేదు. మీరా సరాసరి గర్భాలయంలోకి వెళ్ళింది. 'కృష్ణా! ఒక చేతితో తంబుర మీటుతూ ఒక చేతితో చిరుతలు వేస్తూ నీ పాదాల నేవిధంగా పట్టుకోగలననుకొంటున్నావా? ఇదిగో తంబుర-ఇవిగో చిరుతలు' అని వాటిని అక్కడ వదలివేసి 'శ్రుతి, రాగం, తాళం, పదము అన్నీ ఏకంచేసి నీపాదాలు పట్టుకొంటున్నాను. నాకింకెవ్వరూ లేరు, నీవు తప్ప. నీవు నన్ను విడిచి ఎక్కడికీ వెళ్ళడానికి వీలులేదు', అంటూ తల గట్టిగా కొట్టింది. 'కృష్ణా!' అంటూ క్రింద పడిపోయింది. ప్రాణాలు విడిచింది. ఆమెలోనుండి జ్యోతి బయలుదేరి కృష్ణునిలో లీనమైపోయింది! మందిరం ద్వారాలు తెరచుకున్నాయి. గుణ్ణాలను దౌడుతీయిస్తూ వచ్చిన రాణాకు ఇంక కనిపించకుండా వెళ్ళిపోయింది, మీరా! భక్తి ప్రపత్తుల పవిత్రత ఏవిధంగా ఉంటుందో అందరికీ అర్థంకాదు. లోక సంబంధమైన బాంధవ్యము రావచ్చు, పోవచ్చు. భక్తి బాంధవ్యం వచ్చేది, పోయేది కాదు.

**రాధ ప్రశ్న**

ఒకానొక సమయంలో మందిరంలో కూర్చున్నప్పుడు రాధకు ఒక భావం వచ్చింది.

**వేయబోవని తలుపు**
**తీయ మంటూ పిలుపు!**

sri sathyasaivachanamrutam

అని సన్నగా పాడి కృష్ణుని వైపు చూసింది! ఆయన ముసిముసి నవ్వులు నవ్వుతున్నాడు.

**కృష్ణకెంతో మరులు గొలుపు**

వేయబోవని తలుపు తీయమంటున్నావు! ఇదేమిటి? అని అడిగింది.

**నీలోన నాలోన నిండి వెలిగే వలపు**
**మేలుకుంటే లేదు పిలుపు!**
**విశ్వమంతా ప్రాణవిభుని మందిరమైన**
**వీధివాకిలి ఏదటో?...........**

అప్పుడు కృష్ణుడు చెప్పాడు:

**వీణతంత్రులు మీటి ప్రాణ తంత్రులు నాటి**
**ఆనంద బాష్పములు ఆత్మార్పణము జేయ**
**కైలాసమును చూడుమా ఓ రాధ! వీధివాకిలి అదియెగా!**

వీణతంత్రులు మీటి - అదే మేరుదండం, వెన్నెముక. 33 పూసలున్నాయి, ఈ వెన్నెముకలో. వాటిలో సుషుమ్న నాడి ఉంది. ఆ సుషుమ్న నాడి నేరుగా తలకు ప్రాకుతుంది, సహస్రారమువరకు. ఈ వీణ తంత్రులు మీటి, ప్రాణ తంత్రులు నాటి........ ప్రాణ అపాన వ్యాన ఉదాన సమాన పంచ ప్రాణములను సుస్థిరముగా నాటి, ఆనంద బాష్పముల....... గంగా యమున గోదావరి కావేరి నదుల జలం కాదు. ఆనందబాష్ప జలం. అహంకారం లేకుండా లలాటం మొదలుకొని పాదముల వరకు అష్టాంగములతో సాష్టాంగంగా కర్రవలె పడిపోవాలి. ప్రాణవిభునికి ఆత్మార్పణం చేస్తే అదే కైలాసం, అదే వీధి వాకిలి!

**పరోక్ష విశేషం**

ఏ పనిచేసినా మనస్సు దానిలో లగ్నంచేయాలి. 'కష్టమే' అనుకొని నిరుత్సాహపడిపోకూడదు. రెండు మూడక్షరాల డిగ్రీల కోసం ఎన్ని బాధలు పడటంలేదు? దున్నపోతును రాచిరాచి కడగటానికి టైముంది కాని, సాలిగ్రామానికి అభిషేకం చేయడానికి

sri sathyasai vachanamrutam

టైము ఉండటంలేదు! లౌకిక విషయాలలో ఉండే శ్రద్ధాశక్తులు ఆధ్యాత్మిక విషయాలలో అభివృద్ధి కావటంలేదు. ప్రత్యక్ష ఫలితాలు కావాలి! కాని ఇది పరోక్షమైన అధిక విశేషం! విశేషమైన దానిని అనుభవించడానికి ప్రయత్నించము కాని అత్యల్పమైనదానికోసం అనేకపాట్లు పడతాము. మీరు స్వామికి సమ్మతమైన రీతిగా ఏపనిచేసినా అది తప్పక అవుతుంది. అన్నం తిన్నా 'కృష్ణార్పణం', కసవు ఊడ్చినా 'కృష్ణార్పణం' అనే ఆ భక్తురాలికి కృష్ణుడు వశుడైపోయాడు. కేవలం నోటితో కృష్ణార్పణ మనకూడదు. కొంత మంది టేపురికార్డరు పెట్టుకుంటారు 'కృష్ణార్పణం', 'కృష్ణార్పణం' అనడానికి! ఫలితం టేపురికార్డరుకు వస్తుంది. వీరికెట్లా వస్తుంది? ఏదీ కృత్రిమంగా చేయకూడదు. చాలామంది డబ్బిచ్చి దేవాలయాలలో పూజలు చేయిస్తుంటారు. ఇది చాలా దోషం. పూజ చేసేవాళ్ళు డబ్బుకోసమని పూజ చేస్తారు. ఆ దోషం మనకు వస్తుంది. చక్కగా ఇంటిలో హృదయపూర్వకంగా చేసుకుంటేచాలు.

**(తేదీ 03-05-1987న భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasai vachanamrutam